# నన్ను గురించి నవల రాయరూ?

తెళ్లూరు నాగేశ్వరరావు

**ఏడు** ఒంకర్లుగల సందు అది. సందె వేళలో ఆ సందులో ఒక ఇంటికోసం వెతుక్కుంటోంది నందిత. ఇంటి నంబరుంది. అయితే ఫర్లాంగుకో వీధి దీపం—విసిరేసినట్లు. ఆ దీపాలైనా రెప్ప లార్పకుండా నిలువు కళ్ళతో లేవు. ఇంటి నంబర్లు వరసాగ్గా, స్పష్టంగా లేవు. కొన్ని ఎండకు వెలవెలా పోయినయ్. మరి కొన్ని వానకు వెలిసిపోయినయ్. ఇంకొన్ని భూత అద్దానికి తప్ప అందేట్టు లేవు. ఏమైనా పట్టు వదలకుండా, నిట్టూర్పు విడువకుండా మొత్తానికి కావాల్సిన నంబర్ను కనుక్కొంది నందిత. గేటు ముందుకెళ్ళి వాకబు చేసింది—"నవకవి నిరంజన్‌గా రుండేది ఇక్కడేనా?"

బొగ్గులమ్మే దుకాణం యజమాని ఆమెకేసి ఎగా దిగా చూశాడు. తాపీగా ఘంట చుట్ట వెలిగించాడు. "నవకవో, నల్ల కవో—అదంతా నాకు తెల్దు. మా బొగ్గుల బస్తాల వెనకాతల ఒక తాటాకుల పాక ఉంది. అందులో ఒక జులపాల జుత్తు ఆయన, సోడా బుడ్డి అద్దా లెట్టుకొని ఉంటాడు. నల్లగా, సన్నగా పొగాకు కాడలా ఉంటాడు. కయిత్వం రాత్తాడో లేదో గానీ, ఎప్పుడూ కలకత్తా పాన్ తింటూ ఉంటాడు" అన్నాడు బొగ్గుల కొట్టాయన పల్లికిలిస్తూ.

నందిత మనస్సు నిప్పు సెగ తగిలినట్టు చివుక్కుమంది. కవుల సంగతి కట్టె లమ్ముకొనే వాళ్ళకేం తెలుసు? అనుకొంది. సగం తెరిచిన రేకు గేటులోంచి లోపల కెళ్ళింది. నేలంతా నల్లటి బొగ్గు నుసి. అక్కడక్కడా కట్టెల చితుకులు, సర్వే బాదుల బెరుళ్ళు. ఖట్టాడి మధ్యలో రాళ్ళ బరువుతో ఒంగిన కాటా. దూలానికి వేళ్ళాడదీసిన లైటు కాంతిలో, బొగ్గుల బస్తాల వెనుగ్గా చీర కుచ్చెళ్ళు కొంచెం పైకెత్తి నడుస్తూ పాక దగ్గర కెళ్ళింది.

ఎనిమి దడుగుల వెడల్పు, పదడుగుల పొడవూ గల పాక అది. లోపల నాపరాళ్ళు పరిచి ఉన్నాయి. ఆ పాకకు అడుగున్నర ఎత్తూ, వెడల్పూ గల చిన్న కిటికీ ఉంది. ఆ కిటికీకి కొయ్య కమ్మిలు. చిన్న రేకు తలుపు. రేకు కనబడకుండా సినిమా పోస్టర్లు అంటించి ఉన్నాయి. గాలి కోసం ఆ తలుపు తెరిచే ఉంది. కిటికీ పక్కగా ఒక చిన్న టేబుల్. ఆ టేబుల్ ముందు చేతులూడిన కొయ్య కుర్చీ. ఆ కుర్చీలో ఒక సన్నటి, నల్లటి, జులపాల జుత్తుగల సోడాబుడ్డి అద్దాల కళ్ళజోడు పెట్టుకున్న వ్యక్తి కూర్చున్నాడు. టేబుల్‌మీద తెల్ల కాగితముంది. ఆ కాగితంమీద పది పంక్తులు వ్రాసి ఉన్నాయి. పదకొండో పంక్తి వ్రాయడానికి దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. నోట్లో పాన్ నానుతూనే ఉంది. అతనే నవకవి నిరంజన్ కామోసు అనుకుంది నందిత.

ఆమె నమస్కారం అనకముందే, "ఎవరదీ!" అన్నాడు నిరంజన్.

నందిత లోపల కొచ్చింది.

ఆమె కేసి అద్భుతంగా, అత్యాశ్చర్యంగా కను రెప్పలు ఎడంచేసి చూశాడు నిరంజన్.

ఆమె గది చుట్టూ చూసింది. మరో కుర్చీ లేదు. ఒక పక్కన చాప ఉంది. దాని మీద కొన్ని పుస్తకాలున్నాయి. గలేబులేని, మాసికలు వేసిన దిండు ఉంది. జంపఖానా చుట్టేసిన పక్క చుట్ట ఉంది. నవకవిగారి పేదరికానికి ఆ గది ప్రత్యక్ష సాక్ష్యంగా ఉంది.

సృష్టి సౌందర్యాన్ని శరీర సౌందర్యంతో మేళవించిన లోకోత్తర సౌందర్యవతిలా ఉందామె.

వయస్సు ఇరవై మూడు ఉండొచ్చు.

దోరగా పండిన నిమ్మపండు శరీర ఛాయ. సంపెంగ మొగ్గ లాంటి ముక్కు. అయిదడుగుల అయిదున్నర అంగుళాల ఎత్తు. ఆ ఎత్తును కప్పిపుచ్చే శరీర లావణ్యం. ఆ శరీరానికి అందాన్నిచ్చే చీజ్ కాటన్ చీర పర్సనాలిటీ సొగసును పెంచే బొమ్మ కడ్డు.

అయితే అన్ని హంగులున్నా ఎండలో వానలా ఉందామె. కళ్ళు గుండ్రంగా ఉన్నా, ఆ కళ్ళ కింద వలయంగా ఏర్పడిన నీలి మేఘాలు ఆమె బ్రతుకు బాధకు ప్రతీకగా నిల్చాయి.

"కూర్చోండి" అన్నాడు నిరంజన్ మర్యాదగా.

చాప మీద కూర్చుంది నందిత.

"ఏం కావాలి?" అన్నాడు నిరంజన్ కలానికి మూత పెడుతూ.

"వచన కవిత్వంలో మహా మేధావులని విన్నాను. మీ అడ్రసు వెతుక్కుంటూ వచ్చాను."

ఆమె పొగడ్తకు ఒళ్ళు గగుర్పొడవగా, వెంటనే టేబుల్ మీదున్న కలకత్తా పాన్ వేసుకున్నాడు. 'ఏం కావాలి?' అన్నట్టు మొహాన్ని మూడంగుళాలు ముందుకు చాచి, గుచ్చి గుచ్చి చూశాడు.

"మీరు నాకో చిన్న సహాయం చేస్తారని ఆశించి వచ్చాను."

"నేనా? ముద్రణాలయంలో ప్రూఫు రీడర్నని. ఒళ్ళు వంచి కూలీపని చేస్తే రోజుకు పన్నెండు రూపాయ లొస్తాయి. బి. ఏ. చదువుకున్న నేరానికి ఆ నీచానికి దిగలేకపోయాను. అంతకంటే తక్కువ వచ్చే ఉద్యోగం వెంగబెడుతున్నాను. ఈ భూస్వామ్యం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం నశిస్తేగానీ, వెల్లువలా ప్రభంజనంలా విప్లవం వస్తేగానీ దేశం బాగుపడదు. ప్రజలు బాగుపడరు. నాబోటివాడికి సమాజంలో గుర్తింపు రాదు. గౌరవం పెరగదు. అందుచేతనే నిత్యమూ కళ్ళారా చూస్తున్న దోపిడీలను, దౌర్జన్యాలను, అక్రమ ధన సంపాదనలను, లంచగొండితనాన్ని, ధరం పెరుగుదలనూ, ఉన్నా—లేని వాళ్ళ మధ్య వ్యత్యాసాల అగాధాన్ని సహించలేక కలం పట్టాను. కసి కొద్దీ కవిత్వం రాస్తున్నాను. కాని, ఏం లాభం? డబ్బు లిచ్చే బూర్జువా పత్రికలు నా కవిత్వాన్ని ప్రచురించడం లేదు. భయపడి తిప్పి కొడుతున్నాయి. విప్లవాన్ని ప్రోత్సహించే పత్రికలు ప్రచురించినా, పైసా ఇవ్వలేకపోతున్నాయి. నా సిద్ధాంతాలకు, సంఘాలకు, ప్రబోధనలకు మంచి రోజులు వచ్చేదాకా నా బ్రతుకు ఈ తాటాకుల గదికి అంకితమే! నేను ఆర్థికంగా, మాట సిఫార్సుగా సహాయం చేసే స్థితిలో లేను. ఏం కావాలో చెప్పండి."

"నేను ఇరవై మూడేళ్ళకే అరవై తొమ్మిదేళ్ళ బ్రతుకును అనుభవించాను. నన్ను గురించి మీరు ఒక నవల రాయగలరా?" అంది నందిత వేదనా పూర్వకంగా.

తలుపు కిర్రుమన్నట్టుగా నవ్వాడు నవకవి నిరంజన్.

"నేను నవల రాయడమా? అసంభవం. జరగని పని. జీవితమంత విశాలమైన పునాదిమీద ఆకాశాన్ని చుంబించే హర్మ్యం వంటిది నవల అని నా సోదరుడన్నాడు. ఈ సమాజంలోని కుళ్ళును కాగడాలనే గేయాల ద్వారా కాల్చివేసి, నవ సమాజ నిర్మాణానికి పునాది రాళ్ళు వేయడానికి కంకణం కట్టుకున్న నా కలం కాలక్షేపపు బజారు నవలలు రాయదు, తల్లీ!, మీరు రాంగ్ అడ్రసు కొచ్చారు. వెళ్ళిరండి" అన్నాడు నిరంజన్, రెండు చేతులెత్తి ఆవేశంగా నమస్కారం చేస్తూ.

వనస్థలిపురంలోని వీధి దీపంలా నిట్టూర్పు విడిచి, చాప మీద నుంచి లేచి, బయటి కొచ్చింది

నందిత. నిజంగానే తాను రాంగ్ అడ్రసుకు వచ్చిందని వాపోయింది.

ఆ మరునాడు సాయంకాలం చిక్కడపల్లి వెళ్ళింది నందిత. అక్కడో పేరుమోసిన రచయిత ఉన్నట్టు ఎవరో చెప్పారు. శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్ళే దోవలో ఒక చిన్న పెంకుటింట్లో సగం పోర్షనులో ఒక రచయిత ఉన్నాడు. అతని పేరు తూ. చ. అంటే తూనుగుంట్ల చలమయ్య. ఎన్నో నాటకాలు, నాటికలు వ్రాశాడు. సొంత డ్రామా ట్రూపును తయారు చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఆరు వందల ప్రదర్శన లిచ్చాడు. నాటక రచయితగా గొప్ప పేరు గడించాడు. అయితే ఆలమూరులోని ఆరెకరాల సేద్యపు మాగాణి అతని పేరు నుంచి ఆరుగురి పేర్లకు మారింది. అందుకే ఆ రచయిత భార్య "మా ఆయన నాటకాల్లో దిగేకంటే పునుగుల కొట్టు పెట్టుకున్నా ఏడెకరాల పొలం సంపాయించే వాడు"అని నెత్తీ నోరూ బాదుకుంటుంది. ఆసమ్మం లోకి నందిత ప్రవేశించగానే ఆ మహా తల్లి ఎదురైంది.

"ఎవరికోసం?" అంది మునగ చెట్టును పట్టిన గొంగళి పురుగును చూసినట్టు ఆమెను చూస్తూ.

"తూ. చ. గారున్నారా?" అంది నందిత నెమ్మదిగా.

నూరు కిలోల బరువుగల భారీ శరీరంతో, నలుగురు ఆడ పిల్లల్ని కని, ఒక్క దానికీ పెళ్ళి చేయలేని నలభై ఏళ్ళ వయసులో లోకంలోని చిరాకునంతా మొహంలో ముద్రించుకున్న ఆవిడ నందితను నాటకంలోని వేషాని కొచ్చిన నెరజాణలాగ భావించింది.

"తూ. చ. లేడు, చి చీ. లేడూ! ఏం కావాలి?" అంది ఎదుటి మనిషిని చీల్చి చెండాడే చూపులతో.

చిరిగిపోయిన బన్నీ కింద, తపుడు పీపాలాంటి పొట్టమీద గళ్ళ లుంగీ బిగించి కడుతూ తూ. చ. గారు "ఎవరదీ!" అంటూ వరండాలోంచి దూర్నొ కొచ్చాడు.

నందితను చూసి చిరునవ్వు విసిరి, భార్య కేసి కాట్ల కుక్కలా కళ్ళు ఉరిమి—"రండి! రండి! ఎవరు మీరు? ఎక్కడనుంచి రాక? పనేమిటి?" అంటూ సాదరంగా నాటక ఫక్కీలో ఆహ్వానించాడు తూ. చ.

"మీ పే రిన్నాను—గొప్ప నాటక రచయితని" అంది నందిత వినమ్రంగా.

"నా పేరు మీరు వినడంలో అబ్బుర మేముంది? ఆరు కోట్ల ఆంధ్రుల్లో అర కోటి మందైనా విని ఉంటారు. మీకేం కావాలి? నాటకాల్లో వేషం వేస్తారా?"

"లేదండీ. నన్ను గురించి ఒక నవల రాస్తారేమో నని రిక్వెస్టు చేయడానికి వచ్చాను.

"హతవిధీ! నేను నవల వ్రాయడమేమిటి? నాటకం వ్రాయమంటే నాలుగు గంటల్లో వ్రాస్తాను. నలభై ఎనిమిది గంటల్లో రిహార్సల్ చేయించి స్టేజి మీద వేయిస్తాను. నిమ్మకాయల్ని ముక్కలుగాచేసి, ఎండబెట్టి, వూరగాయ పెట్టడంలాంటిది నవల వ్రాయడం. అది నా వృత్తి కాదు. ప్రేక్షకుల కడుపు చెక్కలయ్యేట్టు డైలాగ్స్ వ్రాయడం, ఒళ్ళూ కళ్ళూ మర్చిపోయేట్టు క్లైమాక్స్‌ను పట్టుకు రావడం నాకళ. అంతే గానీ కూరగాయల వంటకాలు నా చేతకాదు" అన్నాడు తూ. చ. నిర్మొహమాటంగా.

నోరు విప్పకుండానే నమస్కారం చేసి వెనక్కి తిరిగింది నందిత.

రెండు రోజుల తర్వాత బర్‌కత్‌పురాలో ఉన్న ఒక తెలుగు ప్రొఫెసర్ దగ్గర కెళ్ళింది నందిత. ఆయన ఆమెను మర్యాదగా పలకరించి, డాబా ముందు గది కేన్ కుర్చీలో కూర్చోబెట్టాడు.

"ఏమ్మా! తెలుగులో పి. హెచ్‌డి. కి ఎన్‌రోల్ అవుతావా? ఇప్పటికే తెలుగు దేశం అసలు డాక్టర్లతో, నకిలీ డాక్టర్లతో, మెడికల్ డాక్టర్లతో నిండిపోయి. గందరగోళంగా ఉంది. తెలుగులో డాక్టరేట్ చేసిన వాళ్ళు కొంత మంది హైస్కూల్ హెడ్‌మాస్టర్లుగా వుడిగం చేస్తున్నారు. న న్నడిగితే ఈ పరిశోధన బదులు పది గేదెల్ని పెట్టుకొని పాలమ్ముకొంటే పది రాళ్ళు ఎక్కువ సంపాయించుకోవచ్చు. ఏమంటావు?" అన్నాడు తెలుగు ఆచార్యుడు ఆదినారాయణయ్య.

"నేను రిసర్చి కోసం రాలేదండీ."

"మరి."

"నా గురించి నవలేమైనా రాస్తారేమోనని ఆశతో వచ్చాను."

"నవలా?... గతంలో ఇంటర్మీడియట్, బి. ఎ. వారికి అరడజను నవలలు వ్రాసిన మాట వాస్తవమే! నిజం చెప్పాలంటే అవి నేను వ్రాసినవి కావు. ఎవరో వ్రాసిన వాటికి వెయ్యి రూపాయలు పుచ్చుకొని పేరు ఎరువిచ్చాను. అంతేగానీ నేను నవలలు వ్రాయను పైగా చదవను కూడా. వార్తా పత్రిక మినహా వ్యావహారిక భాషలో ఉన్న ఏ పుస్తకమూ చదవను. తెలుగులో యాభై ఆరు అక్షరాలు రానివాళ్ళంతా ఈ రోజుల్లో రచనలు చేసి, కుటీర పరిశ్రమలా తయారు చేసి డబ్బు చేసుకుంటున్నారు. ఈ నవల్లూ, కథలూ వచ్చాక తెలుగు సాహిత్యానికి చెదలు పట్టుకుంది. తెలుగుభాష మైలపడి పోయింది. గంగాజలంలో గుడివాడ మురికినీరు కల్పినట్టు అనేక భాషల్లో మాటలొచ్చి మన భాషను దురాక్రమణ చేస్తున్నాయి. నేను చిన్నయసూరి శైలిలో తప్ప, ఇప్పటి వెంకమ్మ—పుల్లమ్మ భాషలో వ్రాయను. నేను స్వహస్తాలతో నవల వ్రాయడానికి పది వేలు నగదు పుచ్చుకుంటాను. శిష్యులచేత వ్రాయిస్తే అయిదు వేలు. పి. హెచ్ డి. పరిశోధన గ్రంథాలక్కూడా ఇదే రేటు."

మూడోసారి కూడా తాను రాంగ్ అడ్రసు పట్టుకున్నట్లే మొహం చిట్లించుకుంది నందిత. "సరే, వస్తాను" అని చిరునవ్వు ద్వారా సెలవు పుచ్చుకొని, చప్పున బయటి కొచ్చింది.

తన కథను నవలగా రాసే రచయిత కోసం నందిత అన్వేషించడం మానలేదు. సాధారణంగా రచయితలు తమ రచనల కోసం మంచి కారక్టర్లను వెతుక్కుంటారు. అలాంటిది తానే రచయిత కోసం వెతుక్కుంటోంది. చిత్రమే మరి!

మరో నాలుగు రోజుల తర్వాత ఒక సుప్రసిద్ధ నవలా రచయిత్రి అడ్రసును సేకరించింది నందిత. ఆ అడ్రసు ప్రకారం ఆ రోజు సాయంకాలం అశోక్ నగర్ వెళ్ళింది.

అయిదొందల గజాల నల చదరపు స్థలంలో మూడు వేల ఆరొందల అడుగుల ప్లింత్ ఏరియాలో ఆధునిక పద్ధతిలో అందంగా నిర్మించిన భవన మది. ముందు వెల్వెట్ గ్రాస్ లాన్. దాని పక్కన అరచేతి వెడల్పున విరబూసిన పదహారు రకాల గులాబీల గార్డెన్. ప్లాంట్ పోర్టికో. ముఖ ద్వారం ముందు మార్బుల్ మెట్లు. గ్లాస్ విండోలకు ఖరీదైన ఆలివ్‌గ్రీన్ కర్టెన్లు. చందన ఎన్ని నవలలు వ్రాసి అంత అందమైన, అత్యాధునికమైన ఇల్లు కట్టించిందో! అనుకుంది నందిత గేటు తీసుకుని లోపలకు ప్రవేశిస్తూ.

లాన్‌లో అల్యూమినియం గార్డెన్ ఛెయిర్‌లో కూర్చుని ఒకామె రోజీ మరీ రోజర్స్ 'లవ్ స్లేవ్' నవల చదువుతూంది. వయసు నలభై ఉండొచ్చు. డార్క్ గ్రే కలర్ బ్యాక్‌గ్రౌండ్ మీద సీగ్రీన్ పువ్వుల ప్రింట్‌గల గార్డెన్ రీచ్ చీర ధరించింది. రెండున్నర అడుగుల పొడవుతో ఒత్తుగా, ఒదులుగా వేసుకున్న జడ కుర్చీ వెనుకగా గ్రాస్‌కు తాకుతూంది. సంధ్యా కాంతికి ఆమె మొహం బంగారానికి నీడ అద్దినట్టు మనోజ్ఞంగా ఉంది. ఆమె సుప్రసిద్ధ రచయిత్రి చందన అయివుండొచ్చు అనుకుంది నందిత.

దగ్గరగా వెళ్ళి నమస్కారం పెట్టింది నందిత.

నవల చదవడంలో మాటికి నూరు పాళ్ళూ నిమగ్నురాలైన చందన ఆ నమస్కారం అన్న మాటకు ఉలిక్కి పడింది.

ఎదురుగ్గా రాలని కన్నీటి బిందువు లాంటి ఒక స్త్రీ.

"కూర్చోండి" అంది చందన పక్కనే ఉన్న కుర్చీ చూపిస్తూ.

యాంత్రికంగా కూర్చుంది నందిత.

'ఏం కావాలి?' అన్నట్టు చూసింది చందన.

"మీరు నవలలు వ్రాసే..."

"అవును... చందనను!"

"మీ నుంచి ఒక సహాయం కోరి వచ్చాను."

"చెప్పండి."

"రెండున్నర పదులు నిండని నా జీవితంలో విధి పగ బట్టి కసి దీర్చుకుంటూంది. ఆ కసికి తట్టుకోలేకపోతున్నాను. కొంతమందికి ఆశ జీవితాన్ని నడిపిస్తుంది. మరి కొంతమందికి చావు కాలాన్ని ముందుకు నెడుతుంది. ఆ రెండో తరగతికి చెందిన దాన్ని నేను. నా కథ టూకీగా చెబుతాను. దాన్ని మీరు నవలగా రాయాలని కోరుతున్నాను. అదే నా జీవితానికి సంతృప్తి. నా ఆఖరి కోర్కె. వర్తమాన ప్రపంచంలో నా లాంటి అభాగ్యులు ఉన్నారని లోకానికి తెలియడమే నాకు కావాల్సింది. నన్ను గురించి నవల రాస్తారా?"

"తప్పకుండా రాస్తాను. చెప్పండి కథ" అంది చందన ఉత్సాహాన్ని కనబరుస్తూ.

నవలలకు ఇతి వృత్తాలను పాత ఇంగ్లీషు, హిందీ సినిమాల నుంచి, నవలల నుంచీ ఎన్నుకోవడం కంటె వాస్తవ జీవితాల నుంచి తీసుకోవడం, సంఘటనలను పూలమాల గుచ్చి పట్టుగా అల్లడం. పాత్రలను సెంటిమెంట్లను బలంగా సృజించడం,




ఉత్కంఠ రేకెత్తించే సన్నివేశాలను హృదయాలకు హత్తుకొనేట్టు చిత్రించడం ఆమె నవలా రచనలు కొట్టొచ్చినట్టు కనబడే ప్రత్యేకతలు, వాస వాన్ని వాస్తవం కాని వాస్తవంగా టెక్నికలర్‌లో, సినిమా స్కోప్‌లో చూపెట్టే నైపుణ్యం ఆమె రచనలకు ఉండబట్టే ఆమె నవలలంటే అయిదోతరగతి చదువుకొన్న ఆడవాళ్ళ దగ్గర్నుంచీ అరవయ్యోపడిలో పడ్డ విద్యావంతుల వరకూ పడి చస్తారు.

ఒక పావుగంటసేపు క్లుప్తంగా తన కథను చెప్పింది నందిత. సావధానంగా వింది చందన.

“నీది విలక్షణమైన, హృదయ విదారకమైన విషాద గాథ. నీ కథ విన్నాక నా కెంతో సానుభూతి ఏర్పడింది. విధి కల్పించిన పరిస్థితులు ఒక్కొక్కప్పుడు కారుమబ్బుల్లాగ భయంకరంగా కనబడతాయి. అంతమాత్రంచేత వాటికి భయపడకూడదు. కారుమబ్బులే దూది పింజల్లా తేలిపోవచ్చు. జీవితంపై విశ్వాసాన్ని పెంచుకొని, ఎట్లాంటి క్లిష్ట పరిస్థితులనైనా ఎదుర్కొనే ధైర్యాన్ని తెచ్చుకోవాలి” అంది, చందన ఆమెకు సలహా ఇస్తూ.

తల ఆడించింది నందిత—ఆమె సలహాను మనస్సులో మెచ్చుకుంటూ.

పనిమనిషి గార్డెన్‌లోకి టీ తీసుకు రాగా, ఇద్దరూ నిశ్శబ్దంగా తాగారు. ఆ తర్వాత సెలవు పుచ్చుకుని వెళ్ళింది నందిత.

నందిత విషాద గాథను నవలగా రాసింది చందన.

ఆ నవలను ఒక సుప్రసిద్ధ ప్రచురణ సంస్థ ప్రచురించింది.

ఆ నవల మూడు మాసాల్లో దాదాపు పదివేల కాపీలు అమ్ముడు పోయాయి.

ఒక సినిమా కంపెనీ ఆ నవల హక్కులను సినిమా తీయడానికి కొనుక్కుంది.

ఆ నవల మీద చందనకు దాదాపు యాభై వేల రూపాయల దాకా డబ్బు వచ్చింది.

ఆ నవలను నందిత కొని చదువుకుంది. ఆ నవల్లో తన జీవితం కళ్ళకు కట్టినట్టుగా ప్రతిబింబితమైనందుకు ఎంతో సంతోష పడింది.

ఒక నెల రోజుల తర్వాత చందనకు ఒక లేఖ వచ్చింది.

“... నా అర్థింపును మన్నించి నా విషాద జీవిత కథను మీరు నవలగా రాసి, నాలాంటి పాత్రను తెలుగు పాఠకులకు పరిచయం చేసినందుకు ఎంతో కృతజ్ఞురాలిని. మీ ఋణాన్ని ఈ జన్మలో తీర్చుకోలేనందుకు విచారిస్తున్నాను. నా నవలను ఇరవై రూపాయలు పెట్టి కొని, చదివాను. ఎంతో సంతృప్తిపడ్డాను. కాని, ఆ నవల కొంటానికి నేను పెట్టిన ఇరవై రూపాయల ఖర్చు గోరుచుట్టుపై రోకటిపోటు పడినట్లు అయింది. ఆ ఇరవై రూపాయల ఖర్చుకు నా భర్తకూ, మామకూ, అత్తకూ, ఆడబిడ్డకూ సమాధానం చెప్పుకోవాల్సి వచ్చింది. రేపు ఉదయానికి వాళ్ళు నమ్మేట్టుగా సంజాయిషి ఇవ్వకపోతే నన్ను చంపుతామని తలొక రకంగా బెదిరించారు. ప్రస్తుతం అనుభవిస్తున్న ఆర్థిక దుస్థితిలో నేను ఇరవై రూపాయలు పెట్టి మీరు వ్రాసిన నవల కొనడం, చదవడం — నిజానికి వీధిలో అడుక్కునేది ఫైవ్ స్టార్ హోటల్లో చికెన్ పలావ్ తిన్నంత సాహసం చేయడమే! అయితే యేం, నా కథను చదువుకోవాలనే కుతూహలంతో ఆ సాహసం చేశాను. నా సంజాయిషి సరైంది కాకపోతే— నాకు పడే శిక్ష వారం రోజులు పస్తు. కాని నేను సంజాయిషి ఇవ్వదల్చుకోలేదు. వారం రోజులు పస్తుండే నరకం కంటే, నీటి బుడగ లాంటి ప్రాణాన్ని వదలుకోవడం నా లాంటి అభిమానవతికి ఆదర్శప్రాయమైన మార్గమని నమ్ముతున్నాను. మీ నవలల్లో అన్ని పాత్రల కంటే నా పాత్ర పదేళ్ళపాటు పాఠకుల మనస్సుల్లో నిలుస్తుందని నా విశ్వాసం. నా బ్రతుకుపై కమ్ముకున్న కారు మబ్బులు నిర్దాక్షిణ్యంగా వర్షించక మానవు. వాటిని దూదిపింజల్లాగా తేలిపోయేట్లు చేసే దయ, సానుభూతి, కరుణ ‘విధి’కి లేదు. ఏమైనా నన్ను నవలారూపంలో తెలుగు సాహిత్యానికి పరిచయం చేశారు. అదే నాకు కొండంత తృప్తి. ఈ లేఖ చేరేటప్పటికే నేను మరో లోకంలో ప్రాణి నవుతాను —నందిత.”

ఆ లేఖ చదవగానే చందన మనస్సు మహా భయంతో మెరమెరలాడి, ఒళ్ళంతా స్వేదంతో తడిసి ముద్దకాగా, ఏం చేయాలో తోచక నందిత అడ్రసుకోసం ఉత్తరమంతా వెదికింది.

కాని, నందిత చిరునామా ఆ ఉత్తరంలో ఎక్కడా లేదు. ★